## క్లుప్తంగా

### నర్సరీలను సందర్శించిన తమిళనాడు బృందం



తమిళనాడు బృందానికి నర్సరీల గురించి వివరిస్తున్న పుల్లా రాజశేఖర్

కడియం: కడియం ప్రాంత నర్సరీలను తమిళనాడు హార్టీకల్చర్ డిపార్టుమెంట్ అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా సుమారు 50 మంది బృందం హార్టీకల్చర్ ఏడీలు డి.ఉదయ్ కుమార్, కె.ఇలవరసన్ నేతృత్వంలో పలు నర్సరీలను సందర్శించారు. వాటి నిర్వహణ పద్ధతులను తెలుసుకున్నారు. కడియపులంకలోని సత్యదేవ నర్సరీ రైతు పుల్లా రాజశేఖర్ వారికి తమ నర్సరీలో వివిధ రకాల మొక్కలను అభివృద్ధి చేసేందుకు అనుసరించే విధానాలను వివరించారు.

### ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు



డాక్టర్ బ్రహ్మచారిని సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ రమణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని ప్రభుత్వ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బ్రహ్మచారి అన్నారు. బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ (డైట్) 2020–22 బ్యాచ్ స్నాతకోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. డాక్టర్ బ్రహ్మచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 31 కేటగిరిల్లో అత్యున్నత మార్కులు సాధించిన 53 మంది ఛాత్రోపాధ్యాయులకు నగదు బహుమతులు, మెమెంటోలు, సర్టిఫికెట్లను డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ, డాక్టర్ బ్రహ్మచారి అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ సల్మా కోర్స్ టాపర్ అయిన నందేల శ్వేతకు నగదు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఆర్‌జేడీ రాజు, కేవీ సూర్యనారాయణ, అధ్యాపకులు గంగాధర్, సత్యనారాయణ, బాలరాజు, జానకీదేవి, ఎస్తర్, కళావతి పాల్గొన్నారు.

### బీజేపీ ప్రధాన కార్యదర్శుల నియామకం

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ నూతన ప్రధాన కార్యదర్శులుగా నలుగురిని నియమించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బొమ్మల దత్తు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులు బూరా రామచంద్రరావు, గుర్రాల వెంకట్రావు, శెట్టిపల్లి శివనాగరాజు, పన్నాల వెంకటలక్ష్మి నియమితులయ్యారన్నారు.

### రాహుల్ గాంధీపై బీజేపీ తీరు అనైతికం

రాజమహేంద్రవరం సిటీ: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీపై బీజేపీ చాలా అవమానకరంగా ప్రవర్తిస్తోందని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. బీజేపీ ఎంపీ ఒక పోస్టర్‌లో రాహుల్ గాంధీని రావణాసురుడిగా చిత్రీకరించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానికి నిరసనగా శుక్రవారం కంబాల చెరువు సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్, ఏఐసీసీ సభ్యురాలు అమర్ జహా బేగ్ మహమ్మద్ తదితరులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో బెజవాడ రంగారావు, ముళ్ల మాధవ్, ఆకుల భాగ్యసూర్యలక్ష్మి పాల్గొన్నారు.

### ట్రెజరీ ఉద్యోగులపై కేసు

కంబాలచెరువు: తనను వేధిస్తున్నారంటూ ఒక మహిళ గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు వ్యక్తులపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం ట్రెజరీ ఆఫీసులో ఎస్‌కే జాఫరున్నీసా అనే మహిళ పని చేస్తోంది. ఆమెను కొంతకాలంగా డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ ఎక్కౌంట్ డిపార్ట్‌మెంట్ నేతల మోహనరావు, కాకినాడ సబ్ ట్రెజరీ ఆఫీసర్ పాము శ్రీనివాస్ వేధిస్తున్నారు. ఈ విషయాన్ని ఆమె గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. ఆయన దీన్ని కోర్టుకు అప్పగించారు. కోర్టు ఎండార్స్‌మెంట్‌తో మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

### జిల్లాలో 8,217 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 16 వైద్య శిబిరాలు నిర్వహించారు. పులగుర్త, బలభద్రపురం, నందిగంపాడు, కామరాజుపేట, గోపాలపురం 1, మాధవరాయుడుపాలెం, శ్రీరంగపట్నం 2, చీపురుగూడెం, అట్లపాడు, పిట్టల వేమవరం, కాతేరు 3, నందరాడ, చంద్రేడు, కాటవరం, పోచవరం, చివటం వీహెచ్‌సీలలో జరిగిన వైద్యశిబిరాల్లో సాయంత్రం 6 గంటలకు 8,217 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 321 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేసినట్టు డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు.



వీఎల్‌పురంలోని ఆర్‌ఆర్‌ఆర్ ప్రధాన కేంద్రం



పాత బొమ్మలను ఇలా అందంగా మార్చారు



పేదలకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన దుస్తులు

# ఆర్‌ఆర్‌ఆర్.. సూపర్..

- రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్ కార్యక్రమం విజయవంతం
- పాత వస్తువులకు కొత్తందం
- నగరపాలకసంస్థకు ప్రజల అభినందన



పాత డ్రమ్ములను కట్ చేసి తయారు చేసిన కుర్చీలు



పాత చెప్పులు, బూట్లకు కొత్త రూపు

రాజమహేంద్రవరం సిటీ: మనకు అవసరం లేని, ఉపయోగించని పాత వస్తువులను అందిస్తే, వాటిని శుభ్రం చేసి పేదలకు అందించే వినూత్న కార్యక్రమానికి నగర పాలక సంస్థ శ్రీకారం చుట్టింది. రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్ (ఆర్‌ఆర్‌ఆర్) పేరుతో ఈ కార్యక్రమం ప్రారంభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో స్వచ్ఛ సర్వేక్షణ్ నేపథ్యంలో ప్రజల నుంచి పాత వస్తువులను సేకరించి, వాటిని శుభ్రపరచి, తిరిగి అవసరార్థులకు అందించమే దీని లక్ష్యం. ప్రజల భాగస్వామ్యం ఉంటే ఏ కార్యక్రమంలోనైనా విజయం సాధించవచ్చని అధికారులు నిరూపిస్తున్నారు.

**అన్ని డివిజన్లలో కేంద్రాలు**

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 50 డివిజన్లలో 20 పారిశుధ్య మస్టర్ లోకేషన్లలో ప్రజల నుంచి పాత వస్తువులు సేకరించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఈ కార్యక్రమం మొదలైంది. ఇప్పటి వరకూ పాత పుస్తకాలు, చెప్పులు, దుస్తులు, బొమ్మలు సేకరించి, వాటిని శుభ్రపరిచి సుమారు 50 టన్నుల వస్తువులు సిద్ధం చేశారు. వీటిలో 16 టన్నుల మేర దుస్తులు, బొమ్మలు, ఇతర వస్తువులను రంపచోడవరం, చింతూరు తదితర గిరిజన గ్రామాల్లో పంపిణీ చేశారు. స్థానిక వీఎల్‌పురంలో ఆర్‌ఆర్‌ఆర్ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరంలో 20 సెంటర్లనుంచి సేకరించిన పాత వస్తువులను శుభ్రపరచి, తిరిగి పేదలకు అందజేస్తున్నారు. ఇకపై ప్రతి నెలా పుష్కరఘాట్‌లో పేదలకు పంపిణీ చేసేలా ప్రయత్నాలు ప్రారంభించారు.

**విజయవంతం**



ప్రజల భాగస్వామ్యంతో ట్రిపుర్ ఆర్ కార్యక్రమం విజయవంతమంది. మనకు అవసరం లేని, ఉపయోగం లేని వస్తువు.. వేరొకరికి అత్యవసరం అవుతుంది. ఇంట్లో వాడకుండా మూలనపడిఉన్న వస్తువులను ఈ కేంద్రాలకు అందజేయాలి. వాటిని రిపేరు చేసి పేదలకు పంపిణీ చేస్తాం. దీనివల్ల మన ఇంట్లో పేరుకుపోయిన చెత్త కూడా తగ్గుతుంది. తద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్‌కు తోడ్పడినట్టు అవుతుంది.

– దినేష్ కుమార్, నగరపాలకసంస్థ కమిషనర్

### విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలోని అబ్దుల్ కలాం కాలేజీ ఆధ్వర్యంలో క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్, కరెస్పాండెంట్ జి.సూర్యకుమారి తెలిపారు. ఆ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ కమిషనర్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సూర్యకుమారి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆదివారం కాలేజీలో జరిగే స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరుకావాలన్నారు. జూనియర్ కేటగిరిలో 9, 10వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. పోటీలను ఈనెల 12న కలాం కాలేజీ క్యాంపస్‌లో నిర్వహిస్తామన్నారు. విజేతలకు రూ. 50 వేల నగదు బహుమతిని అబ్దుల్ కలాం జయంతి రోజైన అక్టోబర్ 15న అందజేస్తామని తెలిపారు. వివరాలకు 91543 67205, 90596 29934ను సంప్రదించాలన్నారు.

## విద్యార్థుల భద్రతా బాధ్యత ఉపాధ్యాయులదే



విద్యార్థిని జయశ్రీతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం రూరల్: పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు శుక్రవారం ఆమె బొమ్మూరులోని జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ నెల మూడవ తేదీన పాఠశాలలో విద్యార్థిని జయశ్రీపై ఉపాధ్యాయుడు చేయి చేసుకున్న సంఘటన గురించి ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థినులు, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ఎవరికైనా ఆపద కలిగితే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. పిల్లల హక్కుల పరిరక్షణ కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా ఈ సంస్థను సంప్రదించాలని తెలిపారు. అనంతరం అస్వస్థతకు గురైన జయశ్రీ, ఆమె తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. వైద్య సహాయంతో పాటు ఈ విషయానికి సంబంధించి తగిన చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

## మహిళలందరికీ బండారు క్షమాపణ చెప్పాలి

- టీడీపీ నాయకుల తీరు దారుణం
- వైఎస్సార్ సీపీ మహిళా నేతల ఆగ్రహం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మహిళలకు, మంత్రి రోజాకు టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మైనింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి మాట్లాడుతూ ఒక మహిళా మంత్రి విషయంలో అసభ్యంగా మాట్లాడిన బండారు సత్యనారాయణ మూర్తి.. మహిళా లోకాన్నే అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూ మంత్రి స్థాయికి ఎదిగిన రోజాను లక్ష్యం చేసుకుని, ఇలా మాట్లాడడం దారుణమన్నారు. రాజకీయాల్లో హుందాగా వ్యవహరించడం టీడీపీ నాయకులకు తెలియదన్నారు. బాలకృష్ణ మహిళలను కించపరచడాన్ని కూడా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బండారు తక్షణం క్షమాపణ చెప్పకపోతే ఆ రాష్ట్రంలో మహిళల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి నిర్మల, క్లస్టర్ ప్రెసిడెంట్ పోలు విజయలక్ష్మి, రమా సత్యనారాయణస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ దుంగా మంగా లక్ష్మి, మాజీ కార్పొరేటర్లు మజ్జి నూక రత్నం, చోడిశెట్టి సత్యవాణి, గూడూరి రాధిక, పులగం సుధా రెడ్డి పాల్గొన్నారు.

# సురక్ష శిబిరంలో 521 మందికి వైద్యసేవలు



కాతేరులో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం



ఎంఆర్‌పాలెంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు 3 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 521 మందికి వైద్య సేవలు అందించారు. 24 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫరల్ చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. గైనకాలజిస్ట్ అనూష, జనరల్ సర్జన్ ప్రణీత్ రెడ్డి, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ నేతృత్వంలో డాక్టర్లు లిడియా సుచిత్ర, కె.నాగదుర్గ, జగదీష్ కృష్ణ రోగులకు వైద్యసేవలు అందించి అవసరమైన వారికి రక్తపరీక్షలు, ఈసీజీలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్ వైజర్ మేరీ నేతృత్వంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, కాతేరు సొసైటీ అధ్యక్షుడు ఆచంట కల్యాణ్, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వరరావు, రంజిత్, ఆనంద్, పుల్లయ్య, పార్టీ నాయకులు యెజ్జు వాసు, కొత్తపల్లి నాగేశ్వరరావు, కొల్లి నాని పాల్గొన్నారు.

**ఎంఆర్ పాలెంలో..**

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎంఆర్‌పాలెం సచివాలయం 1 పరిధిలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 507 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మణిజ్యోత్స్న పర్యవేక్షణలో జనరల్, గైనిక్, డెంటల్, ఆప్తమాలజీ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఈ శిబిరానికి హాజరయ్యారు. 75 మంది స్కూలు విద్యార్థులకు, ఐదుగురు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మందికి కంటి వెలుగు కార్యక్రమం క్రింద కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 22 మందికి ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. శిబిరాన్ని ఎంపీడీవో కె.రత్న కుమారి సందర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు.

## జగన్ పాలనపై ప్రజలందరి హర్షం

- వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై అన్ని వర్గాల ప్రజలూ హర్షం వ్యక్తం చేస్తున్నారని, మళ్లీ ఆయనే సీఎం కావాలని వారందరూ కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరు శ్రీనివాస్ అన్నారు. 40వ డివిజన్ ఇన్‌చార్జ్, రమా సత్యనారాయణస్వామి ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్ దుంగ మంగ లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఆ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ సక్రమంగా అందుతున్నాయనే విషయం గడప గడపకూ కార్యక్రమం ద్వారా స్పష్టమవుతోందన్నారు. స్థానిక సీతంపేట రామాలయం ఎదురు వీధులు, బృహన్నలపేట కాలనీలో ఆయన పర్యటించారు. ఇన్నీస్‌పేట అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణ రాజు, తగరం సురేష్, యలమంచిలి నాగరాజు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన శాలివాహన నాయకులు



కమిటీ సభ్యులకు ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: జిల్లా శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తం, రాష్ట్ర డైరెక్టర్ పసలపూడి భద్రయ్య, సభ్యులతో కలిసి శుక్రవారం కలెక్టర్ మాధవీలతను కలిశారు. దేవగుప్తాపు లక్ష్మణరావు, పేరూరి నాగేంద్ర శేషాద్రి, పెనుగొండ శ్రీనివాస్, దేవగుప్తాపు అరుణతో కూడిన కమిటీకి కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పురుషోత్తం మాట్లాడుతూ స్వర్గీయ రాజశేఖరరెడ్డి ఫెడరేషన్ ఏర్పాటు చేయగా, పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారన్నారు. కవయిత్రి మొల్ల జన్మించిన మార్చి 13ను రాష్ట్ర పండగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, తిరుమలకొండపై ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా మట్టి పాత్రలు వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

### పారదర్శకత లేని పాలన

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పారదర్శకత లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. భావ నపాడులో ప్రజా పోరాటాలపై పోలీసులు ఉక్కుపాదం మోపి, అరెస్టులకు పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర యువజన సదస్సు 3వ రోజు కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ పాల్గొన్నారు.

### లివర్ వ్యాధులను తొలిదశలో గుర్తిస్తేనే ప్రయోజనం



మాట్లాడుతున్న డాక్టర్ టిమ్ చెరియన్

కంబాలచెరువు: లివర్ వ్యాధులను తొలి దశలో గుర్తిస్తేనే, వాటి నుంచి బయట పడవచ్చని లివర్ వ్యాధి నిపుణుడు, ప్రొఫెసర్ డాక్టర్ టిమ్ చెరియన్ అన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో లివర్ డిసీస్ సెంపోసియ్ పేరిట శుక్రవారం సెమినార్ నిర్వహించారు. దీనికి నగరంలోని వైద్యులందరూ హాజరయ్యారు. లివర్ వ్యాధిగ్రస్తులు, ఆ వ్యాధిపై పరిశోధనలు, ప్రస్తుతం దాని బారిన ప్రజలు ఎలా పడుతున్నారు, కామెర్ల వ్యాధులు, లివర్ కేన్సర్‌లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డాక్టర్ టిమ్ చెరియన్ అవగాహన కల్పించారు. అలాగే గోదావరి జిల్లాల్లో లివర్ మార్పిడి శస్త్ర చికిత్స అందుబాటులో లేదని, దీనికోసం దూరప్రాంతాలు వెళుతున్నారన్నారు. ఆ శ్రమ లేకుండానే రాజమహేంద్రవరంలోనే తొలిసారిగా లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నామన్నారు.

### 10 నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో ఈ నెల 10వ తేదీ నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ జరుగుతుందని తహసీల్దార్ పైడి చిన్నారావు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం రాజవోలులో మైత్రీ కమిటీ సమావేశం జరిగింది. తహసీల్దార్ పైడి చిన్నారావు మాట్లాడుతూ ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను తొర్రేడు, హుకుంపేట, రాజవోలు గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కంట్రోలు రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి మైత్రీ కమిటీని నియమించామన్నారు. మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి కేశవ రామారావు, మండల వ్యవసాయాధికారి భీమరాజు, ఎంఎస్‌వో ప్రభాకరరావు, ఏఎస్‌వో రామం, ఎంపీఐ నారాయణరావు, మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుల నిరసన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అరాచకాలు, అక్రమాలను ఎండగడతామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక డీలక్స్ సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెత్తను తుడిచి నిరసన తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, గంగిన హనుమంతరావు, పండూరి అప్పారావు పాల్గొన్నారు.